పత్రికాప్రకటన　　　　　　　　　　　　　　　　　　　　　　　　　కాకినాడ, 15.9.2018

సాగరతీరాల సహజ నైసర్గిస సౌందర్యాన్ని, సముద్ర జీవ సంపదను పరిరక్షించి భావితరాల కొరకు పదిల పరచవలసిన సమిష్టి బాధ్యతలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విశాల్ ప్రజలకు పిలుపు నిచ్చారు.

శనివారం ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్అప్ డే పురస్కరించి ఇండియన్ కోస్ట్ గార్డ్ స్టేషన్, కాకినాడ, జిల్లా పోలీస్ విభాగం, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, గ్రీన్కోర్ కాడెట్లు, కళాశాలల విద్యార్థులు, కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాకలపూడి ఎన్టిఆర్ బీచ్లో శుభ్రతా ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విశాల్ గున్ని ముఖ్య అతిధిగా హాజరై బీచ్ క్లీన్అప్ శిభిరాన్ని ప్రారంభించి స్వయంగా పారిశుద్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాలోచితంగా, బాధ్యతా రహితంగా సముద్ర తీరాలను ప్లాస్టిక్, పోలీథీన్ వస్తువులు, ఇతర వ్యర్థాలతో కలుషితం చేయడం వల్ల ప్రాకృతిక అందాలు ఛిద్రం కావడంతో బాటు, అలల తాకిడికి సముద్ర జలాల్లో కలుస్తున్న వ్యర్థాలు జలచరాల మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. దాదాపు 40 నుండి 50 శాతం తాబేళ్లు ఈ విషవ్యర్థాలను తిని చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఆహారంగా వినియోగిస్తున్న సముద్ర చేపలలో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు చేరి, ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారడం ఆందోళనకరమైన అంశమన్నారు. ఈ దుష్పరిణామాలపై మేలుకొని సాగరతీరాలను, సాగర జీవులను కాపాడవలసిన సమిష్టి బాధ్యత అందరిపై ఉందని, లేకుంటే అవి భావితరాలకు లుప్తమైపోతాయన్నారు. సాగరతీరాల పరిరక్షణకు ఏటా సెప్టెంబరు 15వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా కోస్టల్ క్లీన్ అప్ డేగా పాటించడం జరుగుతోందని, ఇండియన్ కోస్ట్ గార్డ్, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని ఆయన ప్రసంశించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ తమతో పాటు స్నేహితులు, పొరుగువారు అందరిలో సర్వత్ర ఈ చైతన్యాన్ని విస్తృతంగా జాగృతం చేయాలని కోరారు. సమస్య గంభీరతను దృష్టిలో ఉంచుకుని కేవలం ఏడాదికి ఒక్కరోజు కార్యక్రమంలా కాకుండా బీచ్ క్లీనింగ్ ఉద్యమాన్ని ప్రభుత్వ, ప్రయివేట్, స్వచ్ఛంద, విద్యా సంస్థల సమన్వయంతో ప్రతి నెలా నిర్వహించాల్సిన అవసరం ఉందని, జిల్లా కలెక్టర్తో సంప్రతించి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన తెలియజేశారు.

ఇండియన్ కోస్ట్గార్డ్ కాకినాడ స్టేషన్ కమాండర్ శ్యామ్కుమార్ మాట్లాడుతూ వ్యర్థాలు లేని సాగరతీరాల లక్ష్యంగా గడచిన 33 ఏళ్లుగా అంతర్జాతీయ కోస్టల్ క్లీన్ అఫ్ డే కార్యక్రమాన్ని సెప్టెంబరు 15వ తేదీన జరుగుపుతున్నారని, 2006 నుండి కోస్ట్గార్డ్ కాకినాడ స్టేషన్ ఏటా ఈ శిభిరాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది స్వచ్ఛందంగా పాల్గొనగా, ఇందులో అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా, కోఎడ్యుకేషన్ కళాశాలల విద్యార్థులు, ఎన్సిసి కాడెట్లు 400 మంది, 200 మంది జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, మరో 400 మంది మెరైన్ పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, గ్రీ ఫౌండేషన్, రిలయన్స్, ఓఎన్జిసి, కోరమాండల్, రిలయన్స్, కెఎస్పిఎల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)